సాక్షి
పల్నాడు
బుధవారం ౹ 27 ౹ డిసెంబర్ ౹ 2023




టెన్నిస్ పోటీలకు క్రీడాకారులు

గుంటూరువెస్ట్ (క్రీడలు) : సౌత్‌జోన్ యూనివర్సిటీ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు సూర్య ఆకాష్, సాత్విక్, అభిరాం ఎంపికయ్యారు.



కాశీనాయన స్వామి ఆరాధన

విజయపురిసౌత్: శ్రీ భగవాన్ కాశీనాయన స్వామి 28వ ఆరాధన మహోత్సవాలు కాశీనాయన ఆలయం వద్ద ధర్మకర్త వి.రంగా స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 17,543 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

వార్షిక బడ్జెట్‌పైనే ప్రధానంగా చర్చ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో భాగంగా జెడ్పీ వార్షిక బడ్జెట్‌పై ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌తోపాటు 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలను సర్వసభ్య సమావేశంలో ఆమోదించడం కీలకం కానుంది. గతనెలలో జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించిన బడ్జెట్ ప్రతిపాదనలను బుధవారం జరగనున్న సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగాలకు ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులకు సంబంధించిన అంచనా బడ్జెట్‌ను జెడ్పీ బడ్జెట్‌తో కలిపి ఆమోదించాల్సి ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధిత శాఖలకు సంబంధించిన రూ.781 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలతో కలుపుకుని, రూ.87.97 కోట్లతో కూడిన జెడ్పీ వార్షిక బడ్జెట్ మొత్తం రూ.868.97 కోట్లకు చేరింది. బుధవారం జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు దీనిపై చర్చించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు చిన్నారులు ఎంపిక



మాచర్ల రూరల్: ఆంధ్రా చెస్ అసోసియేషన్ నేతృత్వంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 10 ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో మాచర్ల మండలానికి చెందిన చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజులపాటు గుంటూరులో నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో వీరు ప్రతిభ కనబరచి అండర్ 6లో కటారపు జోషువా, అండర్ 12లో కె శాన్లీ మోజెస్‌లు ఆంధ్రా చెస్ ఎంపిక చేసినట్లు పల్నాడు చెస్ అకాడమి నిర్వాహకులు కిరణ్ తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్ తరఫున 2024 ఫిబ్రవరి బీహార్‌లో జరిగే నేషనల్ చాంపియన్‌షిప్ వారి వయసు విభాగాలలో పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. చిన్న వయసులోనే అత్యధిక ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వీరిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు.

కోటప్పకొండలో ఆరుద్రోత్సవ సందడి



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవ పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కోటయ్య మాలధారులు ఇరుముడులతో కోటప్పకొండకు చేరుకున్నారు. ఆలయం వెనుక ఉన్న అభిషేక మండపంలో ఇరుముడులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆరుద్రోత్సవ పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అర్ధరాత్రి 12గంటల నుంచి జ్యోతిదర్శనంతో పాటు స్వామి వారికి మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం నిర్వహించనున్నారు. బుధవారం తెల్లవారుజాము వరకు అభిషేకాలు జరుగనున్నాయి. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.2700, మోడల్ ధర రూ.2400 వరకు పలికింది.

ఆటల పండగ శుభారంభం

- అంబరాన్నంటిన ఆడుదాం-ఆంధ్రా సంబరం
- పెద్ద ఎత్తున కదలివచ్చిన క్రీడాకారులు
- వేలాదిగా వచ్చిన క్రీడాభిమానులు
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా పోటీలు ప్రారంభం



క్రీడాకారిణికి క్రీడా జ్యోతిని అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు వెస్ట్: సంక్రాంతి పండుగ శోభ ముందుగానే వచ్చిందా అన్నట్లు ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు సంబరాలు అంబరాన్ని అంటాయి. యువత, అభిమానుల కేరింతల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలను ప్రారంభించారు. ముందుగా వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి శాప్ ఫ్లాగ్‌తోపాటు జాతీయ జెండాను ఎగురవేశారు. క్రీడా టార్చ్‌ను ముఖ్యమంత్రి యువ క్రీడాకారులకు అందించగా మాజీ ప్రపంచ నెంబర్ ఒన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మైదానంలో కలియతిరుగుతూ దానిని వేదికపైకి తీసుకొచ్చారు. అక్కడ సిద్ధంగా ఉన్న క్రీడా జ్యోతిని ముఖ్యమంత్రి జగన్, కిడాంబి వెలిగించారు. క్రీడలు జరిగే వేదికల వద్దకు చేరుకుని క్రీడాకారులతో ముచ్చటించారు. అక్కడి నుంచి ముందుగా క్రికెట్ నెట్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను అలరించారు. మంత్రి రోజా కీపింగ్ చేయగా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బౌలింగ్ చేసి ఆకట్టుకున్నారు. తమలో ఒకరిగా సాక్షాత్తూ ముఖ్యమంత్రి కలిసిపోవడంతో యువత మురిసిపోయింది.

క్రీడాకారులకు కిట్స్ అందజేత

వేదికపైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువకులకు క్రికెట్‌తోపాటు ఇతర క్రీడా పరికరాలు అందించారు. బహుదూర్ రామ్‌ప్రసాద్, తాడిబోయిన బాజిలు క్రికెట్ కిట్‌లు స్వీకరించారు. తిరుపతి వెంకటేష్, డి.విజయసాత్వికారెడ్డి బ్యాడ్మింటన్ పరికరాలను, అభినయ్‌రెడ్డి, సీహెచ్.హరిజోషికారెడ్డి వాలీబాల్‌ను ముఖ్యమంత్రి నుంచి స్వీకరించారు. ప్రతి ఏడాదీ ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించుకుందామని ముఖ్యమంత్రి అన్న మాటలకు యువత ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఆర్‌కె రోజా, అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, టి. కల్పలతారెడ్డి, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, మహ్మద్ ముస్తఫా, మేకతోటి సుచరిత, కిలారు రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సమన్వయకర్తలు బలసాని కిరణ్ కుమార్, గంజి చిరంజీవి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీలా, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాల్‌పురం రాము, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, పానుగంటి చైతన్య, పురుషోత్తం, క్లాం హరికృష్ణారెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, ఇంటూరి పద్మావతి, ఐఏఎస్ అధికారులు ప్రద్యుమ్న, ధ్యానచంద్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి, గుంటూరు రేంజి ఐజీ జి.పాలరాజు, గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం వై.ఎస్. జగన్‌తో కిడాంబి శ్రీకాంత్



క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం పర్యటన సైడ్‌లైట్స్

- వేదిక వద్దకు వెళుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తమ మొబైల్స్‌లో బంధించేందుకు మహిళలుపోటీ పడ్డారు.
- క్రీడా పరికరాలు పరిశీలించి, ప్రద్యుమ్నతో మాట్లాడారు.
- క్రీడా టార్చ్‌ను క్రీడాకారిణి సీహెచ్.రమాదేవికి అందించారు.
- ముఖ్యమంత్రి జగన్ షటిల్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్‌తో కలిసి క్రీడా జ్యోతి వెలిగించారు.
- క్రీడాకారులు, యువత, అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రమాణం చేయించారు.
- వేదికపై క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర క్రీడా కిట్‌లను క్రీడాకారులకు అందజేశారు.
- టాస్ వేసి ఖోఖో ఉమెన్ పోటీలను ప్రారంభించారు.
- ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులతో ఫొటోలు దిగారు. క్రీడాకారులతో కరచాలనం చేయడంతోపాటు, వారితో సెల్ఫీలు దిగి ఆశీర్వదించారు
- ముఖ్యమంత్రి క్రికెట్‌తోపాటు, వాలీబాల్, షటిల్ ఆడి క్రీడాకారులకు ఉత్తేజాన్ని ఇచ్చారు.
- ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇచ్చేందుకు పలువురు ప్రయత్నించారు. దీనిని గుర్తించిన సీఎం జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డిని బాధితుల వద్దకు పంపి అర్జీలు స్వీకరించారు.



పోటీలు ప్రారంభ సూచికగా బెలూన్లను ఎగురవేస్తున్న ముఖ్యమంత్రి



క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్ అందజేస్తున్న ముఖ్యమంత్రి



క్రీడాకారుల వివరాలు తెలుసుకుంటున్న సీఎం వై.ఎస్. జగన్, మంత్రి రోజా

క్రీడాకారులకు అద్భుత అవకాశం

- అట్టహాసంగా జిల్లా స్థాయి ఆడుదాం.. ఆంధ్రా క్రీడలు ప్రారంభం
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యాంప్రసాదు
- క్రీడా జ్యోతి వెలిగించి క్రికెట్, షటిల్, వాలీబాల్ ఆడిన ముఖ్య అతిథులు



డీఎస్‌ఏ స్టేడియంలో రంజీప్లేయర్ మహబూబ్‌బాషా నుంచి క్రీడాజ్యోతిని అందుకుంటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యాంప్రసాదు, అధికారులు

నరసరావుపేట: రాష్ట్రస్థాయిలో మేలైన క్రీడాకారులను తయారు చేసేందుకు ఆడుదాం..ఆంధ్రా ఒక అద్భుతమైన అవకాశమని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో అట్ట హసంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాల పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత క్రీడా జ్యోతిని రంజీ ప్లేయర్ షేక్ మహబూబుబాషాతో కలిసి పలువురు క్రీడాకారులు ప్రదర్శనగా తీసుకొచ్చారు. జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. జిల్లా కలెక్టర్ క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా ముఖ్యమంత్రి మానసిక పుత్రిక అన్నారు. ప్రతి మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యమని పేర్కొన్నారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలనే కాంక్షతో ఈ కార్యక్రమం తలపెట్టారన్నారు. జిల్లాలో ఆడుదాం ఆంధ్రా కోసం 1,15,567మంది క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వీరిలో 70శాతం మంది పురుషులుకాగా 30శాతమంది మహిళలు అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆడిన వాడే జీవితంలో విజయం సాధించారని అన్నారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదం పడతాయని వెల్లడించారు. ఇదో మంచి కార్యక్రమం అన్నారు. యువతలో మానసిక ఒత్తిడిని తగ్గించేవి క్రీడలే అన్నారు. సరైన శారీరక శ్రమలేకుండా అకస్మాత్తు మరణాలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని, అటువంటి వాటికి విరుగుడు ఇటువంటి క్రీడలు ఆడటమేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఒక గంటసేపు ఏదో ఒక ఆట ఆడాలని డాక్టర్ గోపిరెడ్డి సూచించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్, షటిల్, వాలీబాల్ ఆటలు తామూ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. జిల్లా క్రీడల అధికారి సురేష్, పాడా వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో ఎం.శేషరెడ్డి, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థిని విద్యార్థులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిని ప్రోత్సహించడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కిట్లు అందజేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క విద్యార్థి, అన్ని వర్గాల వారిని క్రీడలలో భాగస్వామ్యం చేయటం ప్రత్యేకంగా, ప్రతిష్టాత్మకంగా నెల రోజులపాటు క్రీడలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవటం సంతోషకరమన్నారు. ఇంత అద్భుతమైన కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అబ్దుల్ జలీల్, తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, బోయ రఘురామిరెడ్డి, కామనబోయిన కోటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీను, కౌన్సిలర్లు మాచర్ల సుందరరావు, బూదాల మరియమ్మ, ఉప్పలపాటి జాని, కో ఆప్షన్ సభ్యులు అనంతరావమ్మ, మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణబాబు, అల్లి జీవన్, రాధాకృష్ణ తదితరులున్నారు.

క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన గాదె సుజాత



పాత గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనకు స్వాగతం పలికారు.

ఎస్ఐలుగా ఎంపికైన కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన



నరసరావుపేట: పల్నాడు జిల్లా ఏఎస్ఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుళ్లు బత్తుల హరికృష్ణ, బాడిశ రవితేజను జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు. ఎంపికైన కానిస్టేబుళ్లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన హరికృష్ణ, గురజాలకు చెందిన రవితేజ 2018 బ్యాచ్‌లో సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికై జిల్లా ఏఎస్ఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఎంపిక ఫలితాల్లో పోస్టులను దక్కించుకున్నారు.

జిల్లా కోర్టు పీపీగా బ్రహ్మారెడ్డి

పట్నంబజారు: గుంటూరు మూడో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నాలుగో అదనపు జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ డైరెక్టర్ సుదర్శనరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నియామకం జరిగే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని, మూడో అదనపు జిల్లా కోర్టు పీపీగా అదనపు బాధ్యతలు ప్రస్తుత పీపీ సూరిబాబు నుంచి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

టీడీపీని ఓడిస్తేనే రంగా ఆత్మకు శాంతి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లిలో మోహనరంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

సత్తెనపల్లి: ఆనాడు అధికారంలో ఉన్న టీడీపీనే మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగాను పొట్టన పెట్టుకుందని.. టీడీపీని ఓడిస్తేనే రంగా ఆత్మ శాంతిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వంగవీటి మోహన్ రంగా వర్ధంతి మంగళవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రంగా చిత్రపటానికి, గార్లపాడు సెంటర్లోని రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రంగా హత్యానంతర పరిణామాలతో కసితో గెలిచామని, అప్పటి నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచానని ఆయన తదనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట నడుస్తున్నానని వివరించారు. రంగాను చంపింది టీడీపీ ప్రభుత్వమేనని చంద్రబాబు నాయుడే హత్య చేయించాడని, శాసన సభ్యుడినైన నన్ను కూడా చంపాలనే ప్రయత్నం చేసినా వల్ల కాలేదని ఆరోపించారు. ఇప్పుడు సత్తెనపల్లిలో టీడీపీ తరపున పోటీ చేస్తానని చెప్పుకునే వ్యక్తే(కన్నా లక్ష్మీనారాయణను ఉద్దేశించి) అప్పట్లో పదే పదే ఆరోపించారని గుర్తు చేశారు. సభలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ మార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, సీనియర్ కాపు సంఘం నాయకులు, న్యాయవాది బగ్గి నరసింహరావు పాల్గొన్నారు.

పేదలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఓ వరం

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- రైతుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



మంచికల్లులో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

రెంటచింతల: పేదలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఓ వరం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మంచికల్లులో రూ.20.80 లక్షలతో నిర్మించిన క్లినిక్ భవనం, రూ.40 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన సొసైటీ గోదామును మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం... రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లు అన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి మంచికల్లు గ్రామస్తులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రైతుల పక్షపాతిగా పేరు పొందిన సీఎం వైఎస్ జగన్ రైతుల శ్రేయస్సు కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ చేపట్టిన గోదాము నిర్మాణం వలన 99 శాతం వరి పండించే ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి పొట్లపాటి చంద్రారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పింగళ వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, డీడీఓ, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.భాస్కర్‌రెడ్డి, పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచులు జి.సీతారామిరెడ్డి, జి.పుల్లారెడ్డి, పార్టీ నేతలు ఎం.పేరెడ్డి, పి.మల్లారెడ్డి, ఎస్.పెద నాగిరెడ్డి, ఎంపీటీసీ ఎం.అచ్చమ్మ పాల్గొన్నారు.

దంపతుల గొడవ.. భర్తను హతమార్చిన బంధువులు

కతేవరంలో ఘటన



గేరా వాసు (ఫైల్)



వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ

తెనాలిరూరల్: స్థానిక కతేవరంలో భార్యాభర్తల మధ్య గొడవ చివరకు హత్యకు దారి తీసింది. గ్రామానికి చెందిన గేరా వాసు(26) పెయింట్ పనిచేస్తుంటాడు. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వెన్నెలతో ఆయనకు వివాహమైంది. వాసు మద్యానికి బానిసవడంతో ఇరువురి మధ్య రోజూ గొడవలు జరుగుతుండేవి. క్రిస్మస్ పండగ సందర్భంగా సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన వాసు అర్ధరాత్రి 12 గంటల సమయంలో భార్యతో ఘర్షణ పడుతు ఆమెను కొడుతుండటాన్ని చూసి భార్య బంధువులు వారించారు. అయినా వినకపోవడంతో గొడవ పెద్దదైంది. దీంతో భార్య బంధువులు వాసుపై దాడి చేసి స్క్రూ డ్రైవరు, కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయడపడ్డాడు. వాసును చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గ్రామానికి చేరుకున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. మృతుడి బంధువుల వద్ద వివరాలు నమోదు చేసుకున్నారు. ఘర్షణలో మృతుడు వాసు మేనమామ తిరుపతిరావుకు కూడా గాయాలయ్యాయని, అతడి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెదమద్దూరు బ్రిడ్జి త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



పెదమద్దూరు బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: మండలంలోని పెదమద్దూరు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. బ్రిడ్జిని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి నుంచి తుళ్లూరు వరకు డబుల్ లైన్ రోడ్డు ఒకటో దశ గ్రాంట్ కింద 44 కోట్ల రూపాయలతో మంజూరు చేశామన్నారు. ఈ రోడ్డులో వెళ్తున్న ప్రయాణికుల ఇక్కట్లను గమనించి పెదమద్దూరు బ్రిడ్జిని అత్యావసరంగా భావించి కాంట్రాక్టర్ ను ముందుగా బ్రిడ్జి పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టి కొంత పని పూర్తి అయిన తర్వాత అధిక వర్షాలు, తుఫాన్ వలన నీరు ఎక్కువగా రావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ మరియు అధికారులను సమన్వయంతో పనిచేసి బ్రిడ్జి నిర్మాణం రెండు నెలలో పూర్తి చేయాలని అధికారులను కోరారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక



కె.బసవ లింగారావు, జిల్లా శాఖ అధ్యక్షుడు



మొహ్మద్ ఖాలీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె. బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో భాగంగా గుంటూరు జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షునిగా తిరిగి ఎన్నికైన బసవ లింగారావు మంగళవారం తెలిపారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో మొత్తం 40 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వివరించారు. జిల్లా శాఖ ఉపాధ్యక్షులుగా పి. శివన్నారాయణ, పుట్టా జనార్ధనరావు, పి.పార్వతి, పి. లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్ మూర్తి, కె. రమేష్, జి. దాస్, పి. శ్రీను, జి. శివరామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్లుగా చెట్టిపోగు లక్ష్మణకుమార్, ఎస్. విజయబాబు, జిల్లా ఆడిట్ కన్వీనర్‌గా ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా గౌరవాధ్యక్షురాలిగా టి. రామలీల, కన్వీనర్‌గా డి. నాగభారతి, కో-కన్వీనర్లుగా పి. భారతి, షెహనాజ్ బేగం. చంద్రికారాణితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వివరించారు.

యార్డుకు 52,752 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 52,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,854 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 22,200 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,405 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

పేదల మనస్సులో రంగా సేవలు పదిలం

రేపల్లె రూరల్: పేదల మనసుల్లో వంగవీటి మోహనరంగాకు సుస్థిరస్థానం ఉందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో నియోజకవర్గంలోని రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. మోహనరంగా ప్రజలకు భౌతికంగా దూరమైన ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రంగాకు ప్రజల్లో ఉన్న అభిమాన్ని చూసి ఓర్వలేక నాడు టీడీపీ నాయకులు తమ కుట్రలతో హతమర్చారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

గుంటూరు నగరాభివృద్ధే ధ్యేయం

- పశ్చిమ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి
- కీలకమైన అభివృద్ధి పనుల విషయంలో చొరవ చూపండి
- ఏటీఅగ్రహారం ప్రధాన రహదారి పనులు త్వరలో ప్రారంభం
- పశ్చిమ నియోజక అభివృద్ధిపై కౌన్సిల్‌లో మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అధికారులు, కార్పొరేటర్లతో సమావేశమైన మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్

నెహ్రూనగర్: గుంటూరు నగర సంపూర్ణ అభివృద్ధిలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నగరపాలక సంస్థ అధికారులు, పాలక మండలితో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంత్రి రజిని ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే మద్దాళిగిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు ప్రత్యేక చొరవ చూపి ఎక్కడా రాజీ పడకుండా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి త్వరలోనే ప్రారంభించాలన్నారు. రూ.13.82 కోట్లతో డ్రెయిన్‌లు, రోడ్డు నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఏటీ అగ్రహారం నాల్గో లైను రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరంలోని వీధి దీపాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

పట్టణంలో నిర్వహిస్తున్న శానిటేషన్ విషయంలో సంబంధిత అధికారులు నిరంతర పరిరక్షణ తప్పనిసరిన్నారు. గుంటూరు వెస్ట్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని, వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వార్డుల వారీగా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, చిన్న చిన్న సమస్యలను అధికారులు వెనువెంటనే పరిష్కరించాలన్నారు. కార్పొరేటర్లకు అధికారులు అందుబాటులో ఉండాలని, సర్వేయర్ల కొరత ఉందని కొందరు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకు రాగా అప్పటికప్పుడు మంత్రి కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి: మేయర్

మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ 2021లో వైఎస్సార్‌సీపీ పాలకవర్గం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా నగరం అంతటా కనీవినీ ఎరుగని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 1303 అభివృద్ధి పనులకు రూ.293.11 కోట్ల నిధులతో మంజూరు కాగా, ఇప్పటికే రూ.154.31 కోట్ల విలువైన 869 పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మరికొన్ని పనులు ప్రారంభానికి సిద్ధంగా, ఇంకొన్ని అండర్ ప్రోగ్రెస్ లో ఉన్నాయని పేర్కొన్నారు.

ఏళ్ల తరబడి సమస్యలకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే గిరిధర్

పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో వార్డుల వారీగా అనేక ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వంలోనే కృషి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, అదనపు కమిషనర్ కె లక్ష్మీ శివజ్యోతి, ఎస్ఈ(ఎఫ్ఏసీ) సుందర్రామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్ పాల్గొన్నారు.

వినోదాన్ని అందించి.. విజ్ఞానాన్ని పంచి..

ఉత్సాహంగా సాగుతున్న నంది నాటక ప్రదర్శనలు

పాత గుంటూరు: గుంటూరు శ్రీవెంకటేశ్వర వి/జ్ఞాన మందిరంలోని బలిజేపల్లి లక్ష్మీకాంతం కళా వేదికపై ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నంది నాటకోత్సవాలు మంగళవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ ప్రదర్శనలు పౌరాణిక కథాంశాలు, సాంఘిక, సామాజిక అంశాలతో వి/జ్ఞాన వినోదాల సమ్మేళనంగా ప్రదర్శితమయ్యాయి. బాల,యువ నటీనటులు కూడా దశాబ్దాల నటనానుభవం వున్న నటులతో పోటీగా మంచి నటనానుభవాన్ని రంగరించి తమ నటనా ప్రతిభను ప్రదర్శించారు. ప్రేక్షకులు హాస్య, కరుణ రసాత్మక సన్నివేశాల సమయంలో ప్రతిస్పందిస్తూ, కరతాళ ధ్వనులతో, కేరింతలతో ఉత్సాహ పరచారు. ప్రదర్శనల అనంతరం కళాకారుల బృందాలకు నగదు పారితోషికం, మెమెంటో, ప్రశంసాపత్రాలను అందించారు. కొందరు కుటుంబ సమేతంగా వచ్చి ప్రదర్శనలు తిలకించారు. సంస్థ ఎండీ, టి. విజయకుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

సీతాకల్యాణ.. వైభోగమే..

సీతాకల్యాణం పౌరాణిక పద్య నటకం మంగళవారం నాటి తొలి ప్రదర్శన. నాగశ్రీ రచనకు అన్నెపు దక్షిణామూర్తి దర్శకత్వం వహించారు. శ్రీ సీతారామంజనే నాట్యమండలి కాకినాడ వారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. రామాయణంలో సీతా కల్యాణం జరిగిన నేపథ్యంలో నాటకం రూపొందింది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను యాగ సంరక్షణ కోసం తీసుకు వెళ్లటం, అక్కడ రాక్షస సంహారం అయిన తరువాత సీతా స్వయంవరానికి బయలు దేరటం లాంటి సన్ని వేశాల కల్పన బాగుంది. దీంతో పాటు సీతా స్వయంవరానికి బయలు దేరుతున్న లంకాధిపతిని నారదుడు తెలివిగా అడ్డుకుని లోకక్షేమం కోసం అడ్డుకుని ఆపటం లాంటి సన్నివేశాల కల్పనలో నాటకీయత బాగుంది.

విద్యార్థి కల 'తథాబాల్యం'

రెండో ప్రదర్శన కథనం క్రియేషన్స్, క్రాంతి కాన్వెంట్ హైస్కూల్ కొండపల్లి వారు ప్రదర్శించిన నాటిక తథాబాల్యం. అమ్మ సెంటిమెంట్, నేటి బాలల్లో సాంకేతిక పరి/జ్ఞానం మీద వున్న ఆసక్తిని సమ్మిళితం చేసి కవి పీఎస్ఎం రచన, దర్శకత్వాలలో ప్రేక్షకుల ముందుకొచ్చిన నాటిక ఇది. ఓ విద్యార్థి కల నేపథ్యం ఈ నాటిక ఇతివృత్తం. పిల్లలకు బుద్ధిచెప్పాల్సిన పెద్దలు తప్పుదోవలో నడవ కూడదని సందేశమిచ్చింది ఈ నాటిక.

ది ఇంపోస్టర్స్ (అంతా నిజమే చెబుతారు)

ఇది ఒంటరిగా జీవనాన్ని సాగించే ఒక మామూలు ఆడపిల్ల కథ. పదిమంది కోసం ప్రశ్నించడమే అలవాటు చేసుకున్న ఒక ఆడపిల్ల జీవితంలోకి ధనవంతుల క్రౌర్యం, వంచన, హింస ఎలా ప్రవేశిస్తాయో, వాటి ప్రభావంగా ఆ ఆడపిల్ల జీవితం ఎలా ముగిసిపోయిందో తెలియజేసే విషాద గాథ. మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారు రూపొందించారు. ఎస్.ఎం. బాషా రచించారు. ఆకురాతి భాస్కరాచారి దర్శకత్వంలో రూపొందిన ఈ నాటికను ప్రదర్శించారు.

యువతరం - నాటకరంగం

ఇది కళాశాల, విశ్వవిద్యాలయ విభాగ నాటిక. విజయవాడ యంగ థియేటర్ ఆర్గనైజేషన్, సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఇది. యువతరం నాటక రంగంలో రాణిస్తున్న తీరును తెలియ చెప్పింది నాటిక. ఆచారం పేరుతో అనైతికత, అసమంజసత్వం, అన్యాయం, రకరకాల రూపాల్లో స్వార్థ, సంకుచిత, అమానవీయ శక్తుల రూపాల్లో ప్రపంచ వ్యాప్తంగా స్త్రీమూర్తులను వేధిస్తున తీరును చూపించింది ఈ ప్రదర్శన. శ్రీశ్రీ గీతంలోని ఇంకానా ఇకపైసాగదుం అనే గీత పాదాన్ని తీసుకుని అంతే అభ్యుదయ భావాలతో ఎస్ఎస్ నారాయణ బాబు రచనకు వాసు దర్శకత్వంలో ఇంకానా రూపంలో ప్రేక్షకుల ముందు కొచ్చింది ఈ నాటిక.

ఆస్తికలు

పిన్నమనేని మృత్యుంజయ రావు రచనకు, నాయుడు గోపీ దర్శకత్వంలో గంగోత్రి పెదకాకాని వారు ఈ నాటికను ప్రదర్శించారు. ఆస్తులు సమకూర్చుకోవడం డబ్బులు పోగేసుకోవడం సమస్త జీవజాలంలో మనిషికొక్కడికి మాత్రమే ఉన్న విపరీత లక్షణం. మనిషి చచ్చి దయ్యం అయ్యాక గానీ తన జీవితం ఎంత నిష్ఫలమైందో, తన పిల్లలు కూడా తనలాగే ఆస్తుల కోసం వెంపర్లాడటం, మరణించిన పెద్దాయన ఆత్మక్షోభించడాన్ని కళాకారులు చక్కగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు.

శ్రీకృష్ణ - కమలపాలిక' పద్యనాటకం

కర్నూలు లలితకళా సమితి వారు పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచనకు పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించిన ఈ నాటకాన్ని ప్రదర్శించారు. భారత కథ ఆధారంగా రచించిన నాటకం ఇది కమల పాలిక (హిడింబి) భీముని వరించటం, ఘటోత్కచుని జననం ఘటోత్కచుడు, కమలపాలిక యుద్ధ సమయంలో పాండవులకు అనుకూలంగా శ్రీకృష్ణుడి పథకానుసారం వుండి ప్రాణాలను సహితంత్యాగం చెయ్యటం లాంటి వీరోచిత సంఘటనలు నాటకానికి సొబగులద్దాయి.

నేటి నాటక ప్రదర్శనలు ఇవే..

1. ఉదయం 9:30 గంటలకు విశాఖపట్నం జయ కళానికేతన్ నిర్వహణలో విరియాల లక్ష్మీపతి రచనకు కే వెంకటేశ్వరరావు దర్శకత్వంలో శ్రీకాంత్ కృష్ణమాచార్య పద్య నాటకం
2. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి విజయవాడ న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణలో విన్నకోట రాజేశ్వరి రచనకు డాక్టర్ ఎం.ఎస్ చౌదరి దర్శకత్వం అందించిన ప్రపంచ తంత్రం బాలల నాటిక
3. మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయవాడ శ్రీసాయిబాబా నాట్యమండలి, డాక్టర్ రామన్ ఫౌండేషన్ నిర్వహణలో డాక్టర్ పీవీఎన్ కృష్ణ రచన, దర్శకత్వంలో విజ్ఞాన భారతం సాంఘిక నాటకం
4. సాయంత్రం 4:30 నుండి గుంటూరు అభినయ ఆర్ట్స్ నిర్వహణలో శిష్టా చంద్రశేఖర్ రచనకు, ఎం రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన అతీతం సాంఘిక నాటిక
5. సాయంత్రం 6:00 నుంచి గుంటూరు న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణలో డాక్టర్ ఎంఎస్ చౌదరి రచనకు పి దివాకర్ ఫణీంద్ర దర్శకత్వంలో కపిరాజు కళాశాల విశ్వవిద్యాలయాల నాటిక
6. రాత్రి 7:30 నుంచి శ్రీకాకుళం శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం నిర్వహణలో కొత్త పరిమళం సాంఘిక నాటిక
7. రాత్రి 9 గంటలకు విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ నిర్వహణలో రాతిలో తేమ సాంఘిక నాటిక.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

అద్దంకి రూరల్: బైక్‌ను లారీ ఢీకొట్టటంతో వీఆర్ఏ మృతి చెందిన ఈఘటన మంగళవారం అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని బొమ్మనంపాడుకు చెందిన అద్దంకి బ్రహ్మయ్య(55) శింగరకొండపాలెం వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో కార్యాలయానికి బైకు మీద వస్తుండగా 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహానికి సమీపంలో లారీ ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ జీవీకే సుబ్బారెడ్డి పరిశీలించారు.